Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 102
సంచిక : 224
పేజీలు : 3
ఆదివారం, ఏప్రిల్ 26, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN



## సీపీఐ(ఎం) కి వినగాల శ్రీలత చేరిక

**- గ్రామస్థాయిలో ప్రజా పోరాటాలకు మరింత ఊతం**

**టీ మీడియా, ఏప్రిల్ 25,రఘునాథపాలెం:** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్ కుమార్ నగర్ గ్రామపంచాయతీకి చెందిన వినగాల శ్రీలత శనివారం సీపీఐ(ఎం) పార్టీలో చేరారు. గ్రామంలో చైతన్యవంతమైన మహిళగా గుర్తింపు పొందిన శ్రీలత,

మిగతా 3లో



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**-మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**టి మీడియా, ఏప్రిల్ 25 , నేలకొండపల్లి:** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లకు పైగా కాలంగా ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను అధికారులు సమర్ధవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు.గతంలో ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే వారని, ప్రస్తుతం ఇందిరమ్మ పాలనలో అధికారులు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే పరిమితమని, అనంతరం ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.



రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై పారదర్శకంగా వివరాలు తెలియజేస్తూ పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజా దర్బార్ లో వచ్చిన ఫిర్యాదులను వారం,

మిగతా 3లో

## త్రాగునీటి సరఫరాపై హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి

- నిరంతర నీటి సరఫరా నిర్ధారించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**టి మీడియా, ఏప్రిల్ 25 , భద్రాద్రి కొత్తగూడెం:** వేసవికాలంలో త్రాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం ఐడీఓసీ కార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా భద్రాచలం పి.ఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలెక్టర్ వేసవిలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామానికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో బోర్‌వెల్లు, చేతి పంపులు వంటి ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు.మోటార్లలో లోపాలు తలెత్తినపుడు తక్షణమే మరమ్మతులు చేయడానికి అదనపు మోటార్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, ఎంఆర్ఓ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో చివరి దూర ప్రాంతాలకు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీటి



సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే గరిష్టంగా 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు.మున్సిపల్ కమిషనర్లు ప్రతి వార్డులో ఉదయం నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం మండలాల వారీగా త్రాగునీటి సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గుత్తికొయ హ్యాబిటేషన్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటికి గల

మిగతా 3లో

## పాముల ఆవాస కేంద్రంగా సబ్ స్టేషన్

**-చెట్ల పొదల్లో నుండివిష సర్పాలు బయటకు**

**టీ మీడియా, ఏప్రిల్ 25, రుద్రంపూర్:** సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్‌లో ఉన్న సబ్ స్టేషన్ పాముల ఆవాస కేంద్రంగా మారిందని అక్కడి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ పక్కన ఉన్న చెట్ల పొదల్లో నుండి తరచూ విష సర్పాలు బయటకు వస్తుండటంతో ఉద్యోగులు భయాందోళనల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఉద్యోగులు తీసుకువచ్చిన టిఫిన్ బాక్సుల్లో కూడా పాములు కనిపించిన ఘటనలు ఉన్నట్లు వారు తెలిపారు. ఎప్పుడు, ఎటు నుండి పాము వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొనడంతో తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సబ్ స్టేషన్‌లోని మిషనరీ విభాగాల్లో కూడా పాములు ఆవాసాలు ఏర్పరుచుకుంటున్నాయని పేర్కొన్నారు.ఇటీవల రక్షణ వారోత్సవాలు నిర్వహించినప్పటికీ, ఇక్కడ కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోలేదని కార్మికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్ స్టేషన్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలా చేస్తే చిత్తడి వాతావరణం తగ్గి పాముల సంచారం కూడా తగ్గే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.





## పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం

**-ఇంచార్జ్ దైద రవీంద్ర,**

**టి మీడియా, ఏప్రిల్ 25 , సత్తుపల్లి:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన సంస్థాగత నిర్మాణ సమావేశం ముఖ్య అతిథులుగా హాజరైన ఇంచార్జ్ దైద రవీంద్ర,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, డాక్టర్ మట్టా దయానంద్. సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం శనివారం సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పార్టీ భవిష్యత్ కార్యచరణ మరియు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. డాక్టర్ మట్టా దయానంద్?సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తను పార్టీ గౌరవిస్తుందని భరోసా ఇచ్చారు. బూత్ స్థాయి నుండి పార్టీని నిర్మించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నియోజకవర్గ ఇంచార్జ్ దైద రవీంద్ర మరియు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. నాయకులు మరియు కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేందుకే ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసి, సత్తుపల్లి నియోజకవర్గాన్ని కాంగ్రెస్ కంచుకోటగా మార్చాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



## కోతుల సమస్యకు బోన్లు ఏర్పాటు

**టి మీడియా, ఏప్రిల్ 25 ,ములకలపల్లి:** ములకలపల్లి పంచాయతీలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు కోతులతో పడుతున్న ఇబ్బంది గమనించి పంచాయతీ ఎన్నికలకు ముందు ఇచ్చినటువంటి హామీ మేరకు భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి సూచనలతో పాలకవర్గ సహకారంతో శనివారం గ్రామంలో గల కోతులను పట్టడానికి ఏర్పాటుచేసిన బోనులను సర్పంచ్ కొర్సా చంద్రలేఖ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బోనుతో పట్టిన కోతులను సురక్షితంగా అడవి ప్రాంతంలో వదిలివేయనున్నట్లు ఆమె తెలిపారు.మండలంలో మేజర్ పంచాయతీగా మండల కేంద్రంగా ఉన్న ములకలపల్లి పంచాయతీలో ఉన్నటువంటి సమస్యలను, అవసరాలను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు.ప్రజలు కోరుకున్న విధంగా త్వరలోనే కోతుల బెడద తీరుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ పువ్వాల లలితరావు, వార్డ్ సభ్యులు ముదిగొండ శ్రీను, జంపాలరమణ,వీరునాయక్,ఊకే వెంకటమ్మ,ములకలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు గాదె తిరుపతిరెడ్డి,శనగపాటి రవి పసుపులేటి గణపతి, పంచాయతీ వర్కర్స్,గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## నీటి శుద్ధిపై అవగాహన సదస్సు

**టి మీడియా, ఏప్రిల్ 25 ,ములకలపల్లి:** అశ్వారావుపేట నియోజకవర్గంలోని ములకలపల్లి గ్రామం విజయపురికాలనీలో శనివారం మిషన్ భగీరథ నీరు శుద్ధి చేసే విధానం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.నీరు శుద్ధి చేసే విధానాన్ని గ్రామీణ నీటి సరఫరా అశ్వారావుపేట ల్యాబ్ సభ్యులు ప్రజలకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి సర్పంచ్ కోర్స చంద్రలేఖ, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, పంచాయతీ కార్యదర్శి చేకూరి రవి,వార్డ్ సభ్యులు ముదిగొండ శ్రీను, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్, ల్యాబ్ సభ్యులు పాల్గొన్నారు.



# మధిర డిపోలో ఆనంద వాతావరణం

**● శంకర్ గౌడ్‌కు నివాళులు**



**టి మీడియా, ఏప్రిల్ 25 , మధిర :** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య జరిగిన సానుకూల చర్చలతో విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో మధిర ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్‌లి , మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తాలి తదితరులు డిపో వద్ద కార్మికులతో కలిసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. కార్మికుల 32 డిమాండ్లలో ఎక్కువ భాగం పరిష్కారమవ్వడంతో ఉద్యోగుల్లో సంతోషం నెలకొంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆర్టీసీ చర్చల్లో పాల్గొని సమస్యల పరిష్కారాన్ని సాధ్యమైన విధంగా విజయవంతం చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అయితే ఈ సమ్మె కాలంలో నర్సంపేట డిపో డ్రైవర్ కె. శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల మౌనం పాటించి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించడం హర్షణీయమని తెలిపారు. అదే సమయంలో ఎవ్వరూ ఆత్మహత్యలకు ప్రయత్నించకుండా సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం,లి వైస్ చైర్మన్ కోనధని కుమార్‌లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్‌లి మండల బీసీ సెల్ అధ్యక్షుడు చిలువేరు బుచ్చిరామయ్యలి సెక్రటరీ మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటిలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పత్తెపరపు సంగయ్య, ఆవుల కిరణ్, సూర్యదేవర కోటేశ్వరరావులి పట్టణ కాంగ్రెస్ నాయకులు తలుపుల వెంకటేశ్వర్లు, సాలిక సురేష్, మైలవరపు చక్రి, దూదేకుల జానీలి మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రచారం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**● సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు - జాజిరి శ్రీనివాస్**



**టి మీడియా, ఏప్రిల్ 25 ,సత్తుపల్లి:** ప్రచార ప్రకటనల కోసం మాత్రమే ప్రభుత్వం పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. శనివారం కాకర్లపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు, తూకం మిషన్లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.కొనుగోలు కేంద్రాలలో టెంటు తప్ప మరేమీ కనిపించడం లేదన్నారు. గోనెసంచులు లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు 15- 20 రోజుల నుండి ధాన్యం ఆరబెట్టి, తూర్పారపెట్టి రాశులుగా పోసి ఉంచారన్నారు. రైతులు గోనె బస్తాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక్క కాకర్లపల్లి గ్రామంలోనే సుమారు 15 లారీలకు సరిపోను వరి ధాన్యం రాశులుగా పోసి పట్టాలు కప్పి ఉంచారన్నారు. రైతులకు నష్టం కలిగే విధంగా తేమ, తాలు పేరుతో మోసం చేయకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు.సన్న రకం, దొడ్డు రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన 500 బోనస్ అందించాలని కోరారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగునీరుతోపాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రవర్తిస్తే రైతులతోనే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, బెజవాడ లక్ష్మీనారాయణ, కొప్పుల చిన్నస్వామి, రైతులు దొడ్డా సత్యం, గోట్ల శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్ కొరతతో నిలిచిపోయిన వాహనాలు..

**● మొక్కజొన్న రైతులకు డబుల్ దెబ్బ**

**టీ మీడియా ఏప్రిల్ 25, కొణిజర్ల :**

ప్రస్తుతం తలెత్తిన డీజిల్ కొరత కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతింటూ వాహనాలు నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావం నేరుగా రైతులపై పడుతోంది. ముఖ్యంగా మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాళ్ల పరిమితి విధించడం రైతులకు భారంగా మారగా, ఇప్పుడు డీజిల్ కొరతతో మరింత సంక్షోభం ఏర్పడింది.

పంటల కోత, లోడింగ్, రవాణా వంటి కీలక దశల్లో డీజిల్ అవసరం ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రస్తుతం లారీలు అందుబాటులో లేకపోవడం, మొక్కజొన్న మిషన్లు, ట్రాక్టర్లు నిలిచిపోవడంతో పంటలను మార్కెట్‌కు తరలించడం కష్టసాధ్యమవుతోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఇదిలా ఉండగా వాతావరణ శాఖ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని హెచ్చరికలు జారీ చేయడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు వర్షాలకు గురైతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలతో రైతన్న గుండెల్లో ఆందోళన పెరిగి, "రైళ్లు పరిగెడుతున్నాయి" అన్నట్లుగా పరిస్థితి మారింది.



డీజిల్ కొరత ప్రభావం కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా ఇతర కీలక రంగాలపైనా పడే అవకాశముంది. ఆసుపత్రులలో ఉపయోగించే జనరేటర్లు, అత్యవసర సేవల కోసం తిరిగే అంబులెన్సులు కూడా డీజిల్‌పై ఆధారపడటంతో భవిష్యత్తులో అత్యవసర సేవలు కూడా అంతరాయం కలగొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి డీజిల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. లేదంటే వ్యవసాయం నుంచి ఆరోగ్య సేవల వరకు అన్ని రంగాలపై దీని ప్రభావం తీవ్రంగా పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అప్పాయిగూడెం అభివృద్ధికి నిధులివ్వండి

**● వైరా ఎమ్మెల్యేకు సర్పంచ్ దండు ప్రవీణ్ వినతి**

**టీ మీడియా,ఏప్రిల్25, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం ప్రభుత్వ విద్యాసంస్థలకు కేంద్రమైన అప్పాయిగూడెం గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. శనివారం వైరా లో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేలను కలిసి సీసీ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి వసతుల అభివృద్ధికి కావల్సిన నిధులు విడుదల చేయాలని కోరారు.దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు.అప్పాయిగూడెంను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామస్తులు తోటమల్ల వెంకన్న, కుమ్మరి విష్ణుబాబు తదితరులు ఉన్నారు.





## ధాన్యం కొనుగోలు హామీతో

## రైతుల నిరాహార దీక్ష విరమణ

**టీ మీడియా ఏప్రిల్ 25, కల్లూరు**: కల్లూరు మండల పరిధిలో రబీ ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి గోకవరం గ్రామ సర్పంచ్ గుగులోతు శీను ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్ష రెండు రోజుల తర్వాత ముగిసింది. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కల్లూరు ఎమ్మార్వో బ్రహ్మేశ్వరరావు హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మార్వో బ్రహ్మేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ హామీపై సంతృప్తి చెందిన సర్పంచ్ గుగులోతు శీను నిరాహార దీక్షను విరమించారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపాలిటీ 8వ వార్డ్ కౌన్సిలర్ లక్కినేని రఘు,బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి బానోత్ కృష్ణ,ఉప సర్పంచ్,కొర్లగూడెం సొసైటీ సీఈఓతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సరఫరాపై హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి

కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పాల్వంచలో 55, చర్లలో 54, దుమ్ముగూడెంలో 55 త్రాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణలో వాటిని ఎందుకు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారా? ఇంకా పనులు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారునిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేస్తూ, నాలుగు రోజుల్లోపే అన్ని త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా ఆదేశించారు. రానున్న మూడు నెలలు అత్యంత కీలకమని , ఎక్కడా నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న త్రాగునీటి సమస్యలపై సమగ్ర నివేదికలు సమర్పించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



## దళితరత్న అవార్డు గ్రహీత పమ్మి రవికి ఘన సన్మానం

**టీ మీడియా ఏప్రిల్ 25, ఖమ్మం**

ఖమ్మంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ, యూనిటీ ఇన్ డైవర్సిటీ వారు నిర్వహించిన కార్యక్రమంలో దళితరత్న అవార్డు గ్రహీత పమ్మి రవికి ఆత్మీయ అభినందన సత్కారం పూలే ప్రాంగణం దగ్గర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బసవయ్య, పెళ్లూరి విజయ్ కుమార్, కత్తి నెహ్రు, ఆకుల గాంధీ, డాక్టర్ జాఫర్, ఆసఫ్ అలీ, కొమ్ము లక్ష్మి, బొడ్డు గోరి, కొరివి ధనలక్ష్మి, కొమ్ము ఉపేందర్, కొమ్ము అంకిత, పత్తిపాటి వెంకటేశ్వర్లు, బసవయ్య, వెంకన్న, గురవయ్య భద్ర, రాందాస్, బోగాగిరి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## ఐటీసీలో ముగిసిన 24 గంటల నిరసన దీక్ష

**టీ మీడియా ఏప్రిల్ 25, బూర్గంపాడు**

సారపాక ఐటీసీ కర్మాగారంలో కార్మికులు చేపట్టిన 24 గంటల మహా నిరసన దీక్షను శనివారంతో విజయవంతంగా ముగిసింది. 14వ వేతన ఒప్పందంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ మెరు గైన వేతన ఒప్పందం సాధించడమే లక్ష్యంగా ఐఎన్టీయూసీ మిత్రపక్షాలు ఈ పోరాటం నిర్వహించారు. 24 గంటల పాటు అడ్మిన్ బ్లాక్ ఎదుట నిరసన చేస్తున్న కార్మికులకు సీనియర్ కార్మిక నాయకులు గోనె రామారావు నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డిలు మాట్లాడుతూ మంచినీరు, ఆహారం తీసుకోకుండా 24 గంటల పాటు కఠినదీక్ష నిర్వహించామని, ఈ దీక్ష ద్వారానైనా యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పంద విషయంలో గుర్తింపు సంఘం, యాజమాన్యం కాలయాపన చేయడం తగదని సమ స్యలపై స్పందించకుంటే రానున్న కాలంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. దీక్షకు సహకరించిన కార్మికులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు అండగా పోరాడిన నేత ఏలూరి

- కార్యకర్తలకు వెన్నంటే నిలిచిన ధీశాలి
- గాంధీనగర్ లో ఏలూరి వర్ధంతి సభ

**టీ మీడియా,ఏప్రిల్25, సింగరేణి (కారేపల్లి):**అణచివేతకు గురవుతున్న పేదలకు అండగా ఉండి పోరాడిన నేత అమరజీవి ఏలూరి లక్ష్మినారాయణ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగుసత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు లు అన్నారు. ఏలూరి లక్ష్మినారాయణ స్వగ్రామం కారేపల్లి మండలం గాంధీనగర్‌లో శనివారం ఆయన 34వ వర్ధంతిని నిర్వహించారు. ఏలూరి స్తూపానికి నాయకులు పూలమాలలు నివాళ్లు అర్పించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కేసగాని రామ్మూర్తి ఎగరవేశారు.ఈసందర్భంగా మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ పార్టీ అప్పగించిన పనిని తూచతప్పకుండా ఆచరిస్తూ శత్రువుల దాడుల నుండి కార్యకర్తలను కాపాడుతూ వారి వెన్నంటే నిలిచిన ధీశాలి ఏలూరి అని కొనియాడారు.ప్రజలను చైతన్యం చేయటంలో ఏలూరి మించిన వారు లేరని అందుకే వ్యవసాయ కార్మిక సంఘానికి అఖిలభారత నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు.బీజేపీ ఏలుబడిలో ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ట మసకబారుతుందన్నారు.స్వతంత్ర విధానం పక్కనపెట్టి అమెరికా తొత్తుగా నిలుస్తుందన్నారు. అధికార పీఠం నిలుపుకోవటానికి కుల,మత, ప్రాంతీయ విభేదాలను సృష్టించటం తప్ప ప్రజలకు, దేశానికి చేసింది ఏమి లేదన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. చేసిన హామీలు అమలు చేయటంలో వైఫల్యం చెందిందన్నారు. అరకొరగా రుణమాఫీ, రైతు భరోసా, అత్మీయ భరోసా అమలు, గ్యాస్ సబ్సిడీ, పంట కొనుగోలు కేంద్రాల తెరవటంలో వైఫల్యం కనిపిస్తుందన్నారు. కొత్తవాగ్ధానాలు ప్రజల ముందుకు తెచ్చి మభ్యపుచ్చాలని చూస్తున్నారన్నారని విమర్శించారు. పేదలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించటమే ఏలూరికి మనమిచ్చే నివాళ్లు అని అన్నారు. 26వ తేదిన ఖమ్మంలో ఏలూరి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ జరుగుతుందని దానిని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, వైరా



డివిజన్ కమిటీ సభ్యులు బానోత్ బన్సీలాల్,కొండబోయిన ఉమావతి, మండల నాయకులు కరపటి సీతారాములు, రేగళ్ల మంగయ్య, ఎండి ఇస్మాయిల్, దాసరి మల్లయ్య, అజ్మీర శోభన్, కల్తీ రామచంద్రు, పండగ కొండయ్య, పోతర్ల నాగేశ్వరరావు, షేక్ సైదులు, ఎనమనగండ్ల రవి, బోజడ్ల గోవిందరావు, తేజావత్ చందర్, పూనెం బాబు, గోవర్ధనగిరి దశరథ, ఎరిపోతు ముత్యాలు, ఈసాల పగడయ్య, అడపా రామనాథం, గుండా వెంకటరెడ్డి వేముల రామ్మూర్తి, బత్తుల శ్రీనివాసరావు, చావా నాగేశ్వరరావు, ఉపేంద్రచారి ఇతరులు పాల్గొన్నారు.



## తాగునీటి ఎద్దడిపై

# సత్వరమే స్పందించాలి

- శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**టీ మీడియా ఏప్రిల్ 25, భద్రాద్రికొత్తగూడెం:** వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు సత్వరమే స్పందించి పరిస్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. శనివారం స్థానిక సింగరేణి అతిథిగృహంలో మిషన్ భగీరథ, కొత్తగూడెం కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎక్కడైనా బోర్ల మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం కలిగించే పైప్‌లైన్ లీకేజీలను యుద్ధప్రాతిపదికన అరికట్టాలని, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. నీటి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో మేయర్ మూడ్ గణేష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) కి వినగాల శ్రీలత చేరిక

ముఖ్యంగా మహిళలు, పేదలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి అండగా నిలుస్తూ సేవలందిస్తున్నారు.స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి గారు పార్టీ టవల్ కప్పి శ్రీలత ని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల మధ్య నుంచి పోరాట పంథాలో ముందుకు వచ్చిన వారు పార్టీలో చేరడం ద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. శోషిత వర్గాల హక్కుల కోసం సీపీఐ(ఎం) నిరంతరం సాగిస్తున్న పోరాటాలకు ఇది మరింత శక్తినిస్తుందని పేర్కొన్నారు. వినగాల శ్రీలత మాట్లాడుతూ, గ్రామంలో పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పైన సీపీఐ(ఎం) జెండా కింద మరింత దృఢంగా పోరాటం కొనసాగిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం తన శక్తిమేరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కూచిపూడి నరేష్, పువ్వాడ నగర్ గ్రామపంచాయతీ పాలకవర్గం 1వ వార్డు సభ్యుడు కొమ్ము రాంబాబు, 5వ వార్డు సభ్యుడు కే.నవీన్ కుమార్, గ్రామ పార్టీ నాయకులు బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే

నెల, మూడు నెలల వ్యవధిలో పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకుంటా మని మంత్రి తెలిపారుఏప్రిల్ 27 నుంచి ప్రతి ఉమ్మడి జిల్లా పరిధి లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రెవెన్యూ, హౌజింగ్ శాఖల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.వేసవి కాలంలో త్రాగునీరు, విద్యుత్ సమస్యల నివారణకు చర్యలు తీసుకున్నామని, ప్రతి గ్రామంలోని సమస్యలనుపరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.న్యాయమైన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని మంత్రి భరోసా ఇచ్చారు.ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూలి మంత్రివర్యులు, వివిధ శాఖల అధికారులు ఒకే వేదికపై ప్రజల ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారంపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూలి ప్రజలకు భరోసా కల్పించే విధంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను గ్రామ వారీగా గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నా మని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించడం మంచి పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.రాయిగూడెం, అజయ్‌తండా, చెరువు మాదారం, మంగాపురం తండా, అప్పల నరసింహాపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి ముఖాముఖి భేటీ అయ్యారు. ప్రజాదర్బార్ లో సమస్యలువింటూ అర్జీలు స్వీకరించారు.అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరికి తీసుకెళ్తున్నామని తెలిపారు. మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, క్లస్టర్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. క్లస్టర్ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను అదే చోట పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, భూ సమస్యలు, పెండింగ్ పెన్షన్లు, తదితర అంశాలను గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు.ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ ధ్యేయమని, గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఇళ్లులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం తొలి దశలో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలో మరొక దశ ఇళ్లు మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు. భూభారతి ద్వారా అనేక భూ సమస్యలు పరిష్కరించా మని, మిగిలిన సాదాబైనామా సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, మండల ప్రత్యేక అధికారి, వివిధ శాఖల ఉన్నతాధికారుకు, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.